# "ఇంకానా - ఇకపై సాగవు"

ఊరంతా చిన్నబోయి వుంది.

పొద్దు బారెడెక్కింది.

బావులన్నీ పూజలు లేని దేవాలయాల్లా వున్నాయి.

దొడ్లలోని పశువులు తలలు పైకెత్తి పనుగడవైపు చూస్తున్నవి. తల్లులతో వేరైన దూడలు కొడారులలో మేస్తున్నవి. నీళ్ళకోసం కాబోలు ఆవులు అంబా అవే అరుస్తున్నవి.

కాలువల్లో నీరు ఇంకిపోవడంవల్ల, కప్పలన్నీ కాస్త తేమవున్న చోట గుమిగూడి అరుస్తున్నాయి.

కాలి చల్లారిన కుంపట్లలో కుక్కలు దగ్గరికి ముడుచుకొని పడు కున్నాయి.

కోసిన పొలాల కొయ్య కాళ్ళతో చిక్కిన వండ్లగింజల్ని, హరి జన స్త్రీలు ఊడ్చుకుంటున్నారు.

ఊరి చివర చింతచెట్లు నీడన కూడిన కూలీ నాలీ జనంతో, రంగన్న మాట్లాడుతున్నాడు. నాలుగవ తరగతివరకు చదివిన ఆరడుగుల మనిషి ఆయన. తమ బ్రతుకు దెరువుకోసం అప్పుడప్పుడు ప్రభుత్వ అధికారులకు దరఖాస్తులు కూడా వ్రాస్తుంటాడు.

భూమిని నమ్మాలంటాడు<br>
ప్రతివాడు కష్టించి పనిచేయాలంటాడు.<br>
కష్టానికి తగ్గ ఫలితం చెందాలంటాడు.

అలా జరగడం లేదు కాబట్టే ఐదు రోజులనుండి జరిగే రైతుకూలీల సమ్మె సరియైనది, తప్పనిసరి యయిందంటాడు.

* * *

దొరవారిగడి ఎత్తుగా, తెల్లగా ఉంది-దానిముందే వేపచెట్టు రాక్షసిలా విశాలంగా విస్తరించి ఉంది.

దాని మొదట్లో చుట్టూరా సిమెంటు అరుగు పరచుకొని ఉంది.

ఆ అరుగుపై దొర "చంద్రారెడ్డి", పొరచుట్టను పీలుస్తూ, వదిలిన పొగలోకి చూస్తూ ఆలోచిస్తున్నాడు. చుట్టూ కూచున్న రైతులు, భూస్వాములు, దొరవారి ఆలోచనాతీరును ఊహిస్తూ, వారినోటి నుండి ఏమొస్తుందోనని, తమ ఆలోచల్ని ఆపి దొరవైపు చూస్తున్నారు.

ప్రక్కనే ఉన్న కరణం-

"నీళ్ళు-మేతాలేక పశువులు చచ్చే కాలమొచ్చింది" అంటూ దొరవైపు చూశాడు.

తుప్పున ఉమ్మేసి-

"అయినా, ఈ వెదవలకి ఇంత ధైర్యం ఎక్కడిదాంట" అని చుట్టనుసి దులుపుతూ, చంద్రారెడ్డి దొర కరణంవైపు చూచాడు.

"అదే నేనూ ఆలోచించేది. మా చిన్నతనంలో ఒక్కపూట చద్దన్నం వేస్తే, దినమంతా పనిచేసేది, ఈ వెధవలు...ఇప్పుడూ... అమ్మో...అమ్మో..."

అంటూ అగ్నికి ఆజ్యం పోస్తున్నాడు కరణం.
చంద్రా రెడ్డి బుర్రలో సెగలు లేస్తున్నాయి.
కూర్చున్నవారి మనసుల్లో మంటలు లేస్తున్నాయి.

"అసలింతవరకు రావడం ఆలోచించారూ? నేనైతే మొదటినుండ చెపుతూనే ఉన్నా! రేడియో అంటూ ఉంటే ఊళ్ళో అది దొరవారి గడీలోనే ఉండాలి. దొరవారేమో పంచాయతీ ఆఫీసులో పెట్టించారా! రోజు అదేమో" కరణంగారు మాటలు ముగించకముందే-

"నీ రేడియో లేకుంటే వాళ్ళకు వ్యవహారం తెలియదంటావా పంతులూ! ఆ రంగడులేడూ వాడు, రోజు ప్రక్కూరి కెళ్ళి పత్రిక తెచ్చుకుంటాడు, రేడియోలు జనాన్ని చెడగొడ్తున్నాయి.

అదీగాక ! రోజుకో మీటింగు పెట్టి ఈ నాయకులు ఇచ్చే ఉపన్యాసాలు, హామీలు ఇవ్వన్నీ ఏమైనాతక్కువా !

"ఇక ఈ జనం గొర్రెలంటె గొర్రెలు గదా. ఎటుబడి మనకేవస్తుంది తిప్పలు."

"మనకేం తిప్పలు పంతులు !

నాలుగైదు ట్రాక్టర్లుతెస్తే అవ్వే అన్ని పనులు చేస్తయి."

ఇక ఉపన్యాసాలిచ్చిన నాయకులే వచ్చి ఈ వెధవలకు తిండి పెట్టమను !

అయినా ఉపన్యాసాలకు కడుపు నిండితే ఇన్నికష్టాలు ఎందుకంటా!"

వేపచెట్టు ఒక్కసారి ఎండుటాకుల్ని రాల్చింది.

"అయ్యయో ! మొన్న రంగడి మాటలు తమరినలేదా ! సీలింగొస్తుందని, మన భూములన్నీ పోతాయని. అంతేకాదు ఇకనుండి మీ దొరతనం అసలే ఉండదట !

దున్నేవాడిదే భూమట."

ఇంకా ఏమేమో అనబోయిన కరణం వైపుచూసి "ఆపవయ్యా ! ఆపు ! ఏడిశారు ! వాడూ, నీవూ ఈ దొరతనం ఎవరన్నా ఇచ్చింవా, వద్దన్నప్పుడు పోవడానికి".

దొరతనం పోతుందన్న మాట దొరవారివంట్లో కంపరం పుట్టించింది. కళ్లల్లో నెత్తురు చిమ్మించింది.

ఇక దొరవారికి వారి మధ్యలో కూర్చో బుద్ధికాలేదు.

"చూద్దాం ! లే ! ఇంకా ఎన్నిరోజులు చేస్తారట ఈ సమ్మె !

ఈ రోజు తప్పకుండా కాళ్ళబేరానికి రాకమానరు" అంటూ దొరవారు లేచి గదిలోకి నడిచారు.

"అన్నట్లు తమరికో విషయం మనవి చేయాలి - వీళ్ళకు బుద్ధి చెప్పే విధానం నాకు బాగా తెలుసు" అంటూ దొరవారిని అనుసరించాడు కరణం.

• • •

అయిదు రోజులనుండి ఎలాగో పూట గడుపుకొస్తున్న ఆడవాళ్ళు, ఈరోజు చేటల్ని జారగిలవేసి, చంటిపిల్లల్ని కొడ్తున్నారు. భర్తల్ని తిడుతున్నారు. ఎవరింట్లో కూడా పొగ రావడంలేదు.

చింతల కింద రంగన్న మాటలు ఎవ్వరూ వినడంలేదు.

"కూలీల సంఘం - వర్ధిల్లాలి."

"రంగన్నకు జై"

అన్న వాళ్ళంతా, ఈ రోజు రంగన్నకు ఎదురుతిరుగుతున్నారు.

అయినా రంగన్నలోని ఓపికమాత్రం నశించలేదు.

అతనికి తెలుసు. దీనికంతా కారణం "ఆకలి" అని.

అంతలోనే కరణంగారి వద్దనుండి కబురొచ్చింది.

కాకుల్లా లేచిపోయారు అందరూ, రంగన్న, మరో నలుగురు తప్ప.

పోయిన వారికోసం దొరవారి గరిసె తెర్చుకుంది. కూలీల గుడిసెల్లో ఆ పూట కూడు ఉడికింది.

రకరకాల ఆలోచనల్తో రాత్రిగడిచింది.

◆ ◆ ◆

మరునాడు ఊళ్ళోకి పోలీసు వ్యానొచ్చింది.

కళ్ళల్లో దుమ్ము చిమ్ముతున్నా, దానివెనకాలె పరిగెత్తుతున్నారు, బడి పిల్లలు.

వ్యాను గడిముందు ఆగింది.

పోలీసులు కూలీల ఇండ్లు సోదా చేశారు.

వాళ్ళ ఇళ్లల్లో జొన్నలు చూశారు. ఎస్. ఐ. గారు గరిసెను చూశారు. పగిలిన తాళాల్ని, విరిగిన తలుపుల్ని పరిశీలించారు. క్రింద పడ్డ జొన్నల్ని చేతిలోకి తీసుకున్నారు.

గుడిసెల్లోని జొన్నలు - పోలీసుల చేతుల్లో
గరిసెల్లోని జొన్నలు
యస్. ఐ. గారి చేతుల్లో,
రెండింటినీ పోల్చి చూశారు.

మచ్చు కలిసింది.
కూలోళ్ళకి ఉచ్చువచ్చింది.
ఊళ్లో చిచ్చులేచింది.

రాత్రి రంగన్న గరిసెను దోచాడు. అతని అనుచరులు గుడిసెల్లోకి జొన్నలు మోశారు.

దొరగారి కుక్కలు మొరిగినవి.
గాడిముందు గాడిదలు పరుగెత్తినవి.
ఇంకా ... ఎన్నో ... ఎన్నో ...
సాక్ష్యాలు ...... సంతకాలు.
అన్నీ చకచకా జరిగిపోయినవి. పంచనామా ముగిసింది.

రంగన్నను, అతని అనుచరుల్ని పోలీసులు వ్యానులోకి ఎక్కించు కొనిపోయారు. వాళ్ళ, వాళ్ళ ఆడవాళ్ళు ఏడుస్తూ పెట్టే శాపనార్థాలు, తిట్లూ వినలేక దొరవారు, పంతులుగారు గడిలోకి నడిచారు.

బస్తా బియ్యాన్ని, బండిమీద వేసుకుని, ఖాళీస్థలంలో కట్టెలు నింపుకొని, ఓ మేకపోతుని బండికి కట్టుకొని మస్కూరి, పోలీసువ్యాను పోయిన తోవను అనుసరించాడు. వెనుక నడుస్తున్న మేకపోతు బెదిరి అరుస్తుంది.

పోలీసులు ఊళ్ళోకి వచ్చి, ఇంతమందిని పట్టుకుపోవడానికి కారకులు, కరణం - దొరవారన్న సంగతి, బడి పిల్లలు గ్రహించేసరికి బడి గంట మ్రోగింది.

కాని వాళ్ళు బడివైపు పోక పిడికిళ్ళు బిగిస్తూ గడివైపు నడిచారు.